www.kalamjyothi.com

# కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శుక్రవారం
18.09.2026







# ప్రజా పాలనతోనే తెలంగాణ ప్రగతి

## సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో పాలన

సాయుధ పోరాట యోధుల త్యాగాలు, ఆకాంక్షల స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల మాటకు విలువనిస్తూ ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతికే పరిస్థితులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయ సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే రాష్ట్రాన్ని గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

కలంజ్యోతి, హైదరాబాద్






## ఇరు కుటుంబాల ఆస్తులపై
# విచారణకు సిద్ధం

### సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి

- ధైర్యముంటే సస్పెన్షన్లు ఎత్తివేసి సభను నడపాలి
- మిగిలిన 933 ఎకరాల భూమి ఎక్కడ
- వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే కుట్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

4లో..

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 17) :** కేసీఆర్, రేవంత్ రెడ్డి కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు, అసెంబ్లీలో సీఎం ప్రసంగంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించి వెంటనే విచారణకు రావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సొంత సిట్‌లు కాకుండా న్యాయవ్యవస్థ ఆధ్వర్యంలోనే తేల్చాలని, తమ వైపు

మిగతా 4లో..

## అమరుల త్యాగాలను
# భావితరాలకు చాటాలి

### ఏకీకృత భారతానికి పటేల్ బలమైన పునాది

### దేశ ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్

4లో..



# చరిత్రను రాజకీయం చేయొద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం
**శ్రీలక్ష్మిరామానంద్**

- అమరవీరుల త్యాగాలతోనే ప్రజాపాలన సాధ్యం
- మున్సిపల్ కార్యాలయంలో జాతీయజెండావిష్కరణ



**కలంజ్యోతి, నర్సంపేట (సెప్టెంబర్ 17) :** ప్రజా పోరాటాలతో నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పలికి తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

**అమరవీరుల త్యాగాలతోనే ప్రజాపాలన సాధ్యం ..**

ఈ సందర్భంగా పెండెం శ్రీలక్ష్మిరామానంద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడిన వీరుల స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధి పథంలో సాగాలని ఆకాంక్షించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ తీసుకున్న నిర్ణయం, ఆపరేషన్ పోలో ద్వారానే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తుచేశారు. తెలంగాణను భారతదేశంలో భాగం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని స్పష్టం చేశారు.

**చరిత్రను రాజకీయం చేయొద్దు..**

చారిత్రక ఘట్టాన్ని కొందరు ఓట్ల కోసం వాడుకుంటూ మతాల మధ్య చిచ్చులు పెట్టాలని చూస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ విద్వేష రాజకీయాలను ప్రోత్సహించదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిజాం అణచివేత ముగిసి ప్రజల చేతికి అధికారం వచ్చిన రోజుగా అధికారికంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తున్నామని వివరించారు. రజాకార్ల క్రూరత్వానికి ఎదురొడ్డి నిలిచిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, ఏఈ చంద్రమౌళి, కౌన్సిలర్లు మాదాసి రవి, పున్నం నరసింహారెడ్డి, ఏపూరి శ్రీనివాస్ రెడ్డి, వేముల సంధ్య సాంబయ్య గౌడ్, శివరాత్రి స్వామి, మండల శ్రీదేవి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన
# గాలి అనిల్ కుమార్

**కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 17) :** ఏసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్ ఢిల్లీలో గురువారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు. టీపీసీసీకి సంబంధించిన పలు కీలక అంశాలను నేతలు ఆమె దృష్టికి తీసుకెళ్లగా, సమన్వయంతో పార్టీని ముందుకు నడిపించాలని మీనాక్షి నటరాజన్ సూచించారు.



# వేతనాల కోసం ఆపరేటర్ల వెతలు

**ఆర్థిక ఇబ్బందుల్లో ఈ-పంచాయతీ సిబ్బంది**



**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 17) :** పల్లెల్లో పారదర్శక పాలన అందించేందుకు నియమితులైన ఈపంచాయతీ ఆపరేటర్లు గత ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 33 మంది, మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఆపరేటర్లకు నెలల తరబడి జీతాలు నిలిచిపోయాయి. సమాన పనికి సమాన వేతనం దక్కకపోగా, ఉన్న జీతాలు కూడా రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, జిల్లా కలెక్టర్ స్పందించి బకాయిలు ఇప్పించాలని ఆపరేటర్లు ఎల రాజు, భూక్య ధనోజ్ కుమార్, కునబోయిన నరేష్ విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి

**చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అధికారులు**

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 17) :** కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో డీఆర్వో రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, ఇతర అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

**పీఏసీఎస్ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్**

**సహకార సంఘంలో జెండా ఆవిష్కరణ**

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 17) :** మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సెప్టెంబర్ 17 సందర్భంగా సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాచరిక పాలన నుంచి విముక్తి పొంది భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక దినమిదని, అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో సహకార సంఘాలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అవుల రాములు, జున్నుతుల మహేందర్ రెడ్డి, చిప్ప లక్ష్మణ్, ననుమాస వీరస్వామి, నర్సింహారావు, కందిక విజయ రఘు, ఉప సర్పంచ్ బానోత్ రమేష్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కందిక ప్రవీణ్ కుమార్, సీఈవో చిట్టె రవి, కట్టరెడ్డి, శ్రీను, రాజు పాల్గొన్నారు.



## సరస్వతి భక్తబృందానికి ఘన సన్మానం

### సాయినగర్ గణేష్ మండపం వద్ద సత్కారం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 17) :** నంతారం గ్రామ సరస్వతి భక్త కళాబృందానికి ప్రముఖ వ్యాపారవేత్తలైన రావికంటి వారి కుమారులు కరీంనగర్‌లోని సాయినగర్ గణేష్ మండపం వద్ద ఘన సన్మానం చేశారు. పలు గ్రామాల్లో, ప్రముఖ దేవాలయాల్లో ప్రదర్శనలు ఇస్తూ గుర్తింపు తెస్తున్న కళాబృందాన్ని అభినందిస్తూ జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రావికంటి రాజేశ్వరి, రాంమోహన్, నాగరాజు, సునీల్, సరస్వతి కళాబృందం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.




## భక్తులకు ఇబ్బందులు రావొద్దు

### సబ్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రచారి

**ఎర్రకుంటలో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**

**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 17) :** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎర్రకుంట వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎస్సై ఉపేంద్ర చారి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎం. రాజు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనం కోసం క్రేన్ ఏర్పాటుతో పాటు వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు శాంతియుత వాతావరణంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజయ్య, వార్డు సభ్యులు, యువజన సంఘాల అధ్యక్షులు రేగుల కార్తీక్, అంతటి శ్రీకాంత్, కూనబోయిన రఘు, పీఏసీఎస్ డైరెక్టర్ ఒగ్గు రమేష్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు దాసరి శివ, కొట్టే వెంకన్న, తిరుపతి, సంజీవ్ రెడ్డి, కునబోయిన సుధాకర్, ఒగ్గు మధు, నమ్ము, యాస నిఖిల్, గోల్కొండ నాగరాజు, నార్ల సాయి, ప్రవీణ్ పాల్గొన్నారు.



## ఎఫ్‌పీవో సభ్యత్వంతో రైతులకు మేలు

### పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి

**కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 17) :** రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం తీసుకుంటే భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని హత్నూర పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి తెలిపారు. కొన్యాల, గుండ్ల మాచునూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సభ్యత్వ నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. సభ్యత్వం పొందిన రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి సాగు సలహాలు అందిస్తామని, ఎరువుల పంపిణీలో మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీహరి, వార్డు సభ్యులు బద్రేశ్, నాయకులు వెంకటేశం, అశోక్, నర్సింలు పాల్గొన్నారు.



### తండాలను పంచాయతీలుగా మార్చిన

# ఘనత కేసీఆర్‌దే

- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం
- రిజర్వేషన్ల పెంపుతో పెరిగిన అవకాశాలు
- హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 17) :** మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ జెడ్పీటీసీ బానోత్ పత్తి నాయక్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గిరిజనుల స్వయంపాలన, ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పత్తి నాయక్ తెలిపారు. తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, తాగునీరు, 24 గంటల విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు.

**రిజర్వేషన్ల పెంపుతో పెరిగిన అవకాశాలు..**

గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం వల్ల విద్యార్థులకు ఉన్నత విద్య, వైద్యం, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు విస్తృతమయ్యాయని వివరించారు. గురుకుల విద్యాసంస్థల ఏర్పాటు, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత గత ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు.

**హామీల అమలులో ప్రభుత్వం విఫలం..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు బానోత్ లాల్ సింగ్, మాజీ సర్పంచులు గుగులోతు స్వామి నాయక్, బాదావత్ వీరన్న, మండల నాయకులు ఆంగోతు వీరసింగ్, బోడ ఆనంద్, భూక్య కిషన్, బోడ మురళి నాయక్, బోడ బద్రు, అజ్మీర బిక్షపతి, అజ్మీర బాలాజీ, దప్పు వీరన్న, గుగులోతు ప్రభాకర్, బోడ సాగర్, జరుపుల నర్సు, బోడ సంపత్, కొర్ర మోహన్, భూక్య భాస్కర్, ప్రవీణ్, బోడ దంజ్య, అజ్మీర రమేష్ పాల్గొన్నారు.



## ఘనంగా సర్పంచ్ కరుణాకర్ జన్మదిన వేడుకలు

**గణపతి మండపం వద్ద అన్నవితరణ**

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 17) :** పాత మగ్ధంపురం గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్, వారి కుమార్తె విష్ణుప్రియ జన్మదినం సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీ గణపతి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కరుణాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, అనంతరం భక్తులు, ప్రజలకు అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలవాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమారి, సొసైటీ డైరెక్టర్ నమాస వీరస్వామి, వార్డు సభ్యులు కొయ్యల స్వప్న, నాంపెల్లి సంపత్, కట్టూరి లక్ష్మణాచారి,



జన్ను రమేష్, ధోనీకెల రాజమాత, మదాసి అనిత, పఠాన్ హసీనా, యూత్ సభ్యులు గద్దల ప్రశాంత్, గుర్రం స్వామి, కొయ్యల భాస్కర్, మైదం బన్నీ, సదిరం రాజు, చేరిపెల్లి రాజు, పరికి నవీన్, అలవాల కిక్, చేరిపెల్లి అభిషేక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ స్థల పరిశీలన



### అధికారులకు కలెక్టర్ కీలక సూచనలు

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 17) :** పట్టణంలోని సోఫీనగర్‌లో విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం పరిశీలించారు. స్థల విస్తీర్ణం, విద్యుత్ ఉపకేంద్ర ఏర్పాటు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యాపులను పరిశీలించి నిర్మాణ పనులపై పలు కీలక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, డీఈ నాగరాజు, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

- రైతు భరోసా, కళ్యాణలక్ష్మితో పేదలకు ఊతం
- విద్యా, వ్యవసాయ రంగాల్లో పురోగతి
- బాసర అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 17) :** ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రవేశపెట్టిన పథకాలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలనిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు.

**పేదలకు ఊతం..**

పేదలకు నీడ కల్పించే లక్ష్యంతో జిల్లాకు 9,268 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 3,150 నిర్మాణాలు పూర్తయ్యాయని, ఇందుకు రూ.171.20 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రైతు భరోసా కింద రూ.267.96 కోట్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 11,821 మంది లబ్దిదారులకు రూ.118,34,71,236 అందజేసినట్లు వివరించారు.

**విద్యా, వ్యవసాయ రంగాల్లో పురోగతి..**

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలవడం గర్వకారణమని, పాఠశాలల మౌలిక వసతుల కోసం 628 బడులకు రూ.20.65 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. మార్క్‌ఫెడ్ ద్వారా 44,878 మంది రైతుల నుంచి కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు జరిపినట్లు పేర్కొన్నారు.

**బాసర అభివృద్ధికి ప్రత్యేక నిధులు..**

బాసర మాస్టర్ ప్లాన్ అమలుకు రూ.354 కోట్లు విడుదలయ్యాయని, పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతకుముందు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్వో రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## వెల్జిపురంలో సబ్ స్టేషన్ స్థల పరిశీలన

### ఎమ్మెల్యే చొరవతో త్వరలోనే పనులు ప్రారంభం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 17) :** వెల్జిపురం గ్రామంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించిన భూమిని గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, తహసీల్దార్ సురేష్ గురువారం సంయుక్తంగా పరిశీలించి కొలతలు వేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి విద్యుత్ సమస్యను తీసుకెళ్లగా సబ్ స్టేషన్ మంజూరైందని, స్థల పరిశీలన పూర్తయినందున నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రఘు, జీపీఓ రమేష్, ఏఈలు నగేష్, నవీన్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేశం, లైన్‌మెన్ కనకయ్య, అసిస్టెంట్ హెల్పర్ నరేష్, కిషోర్, ఒరెం భార్గవ్ రెడ్డి, వేములవాడ రమణాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలనతోనే తెలంగాణ ప్రగతి

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 17) :** నిజాం రాచరిక పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్యం ఏర్పడిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. నాటి సాయుధ పోరాట యోధుల త్యాగాలు, ఆకాంక్షల స్ఫూర్తితోనే నేడు ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు.



**యోధుల స్ఫూర్తితో పాలన..**

ప్రజల మాటకు విలువనిస్తూ, ఆత్మగౌరవంతో బతికే పరిస్థితులు కల్పించడమే నిజమైన ప్రజా పాలన అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కి చేరి దేశ సగటు కంటే 91 శాతం అధికంగా ఉందని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా దేశంలోనే తొలిసారి ఎస్సీ వర్గీకరణ చేపట్టి, ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించామని తెలిపారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట..**

రైతుల సంక్షేమానికి కట్టుబడి రూ. 20,616 కోట్లతో 25.35 లక్షల కుటుంబాలకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని చెప్పారు. రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లు జమ చేయడంతో పాటు సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని, 32 నెలల్లో వ్యవసాయానికి రూ. 1.72 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. నియోజకవర్గానికి 20 నుంచి 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

**హైదరాబాద్‌లో హార్వర్డ్ కోర్సులు..**

రాష్ట్రాన్ని గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం డిసెంబర్ నుంచి నగరంలో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ తరగతులు ప్రారంభిస్తుందని వెల్లడించారు. యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా బృందంతో చర్చలు జరిపిన సీఎం, డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు వారిని ఆహ్వానించారు.

**ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్..**

భారత్ ఫ్యూచర్ సిటీని 30 వేల ఎకరాల్లో తొలి నెట్‌జీరో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని, అందులోనే గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలను నెలకొల్పుతామని పేర్కొన్నారు. ఎంఐటీ, హార్వర్డ్ వంటి సంస్థల భాగస్వామ్యంతో కోర్సులు తెస్తామని, రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇరు కుటుంబాల ఆస్తులపై విచారణకు సిద్ధం

▸▸ మొదటిపేజీ తరువాయి

ఏ తప్పైనా బయటపడితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని ప్రకటించారు. గోదరాతలు రాసుకునే రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్ ప్యాలెస్, కోట్ల ఆస్తులు, ఆయన సోదరులకు కంపెనీలు ఎలా వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని నిలదీశారు.

**సస్పెన్షన్లు ఎత్తివేసి సభను నడపాలి..**

శాసనసభ సమావేశాలను నెల రోజుల పాటు పొడిగించి, ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై విధించిన అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని సవాల్ విసిరారు. సభలో ప్రజా సమస్యలపై నిలదీస్తామనే భయంతోనే ప్రభుత్వం పారిపోతోందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల మోసంపై ప్రభుత్వాన్ని నిలదీసి తీరుతామని హెచ్చరించారు.

**మిగిలిన 933 ఎకరాల భూమి ఎక్కడ..**

గతంలో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ అంటూ ఆరోపించిన రేవంత్ రెడ్డి, నిన్న అసెంబ్లీలో కేవలం 67 ఎకరాలు మాత్రమే ఉందని ఒప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్న ఆ భూమి చట్టబద్ధమైనదని, మిగిలిన 933 ఎకరాలు ఎక్కడున్నాయో చూపిస్తే ప్రభుత్వానికే రాసిస్తామని, అబద్ధాలు ప్రచారం చేసినందుకు సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో పేదలకు పట్టాలిచ్చిన భూములను కబ్జాలుగా ముద్రవేయడం దుర్మార్గమన్నారు.

**వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే కుట్ర..**

ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యం, ఉద్యోగుల పెన్షన్ బకాయిలు, విద్యుత్ కోతలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ముఖ్యమంత్రి అసెంబ్లీలో తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల కోసమే భూములపై 22ఏ తెచ్చారని, దాన్ని రద్దు చేసేంత వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.



## అమరుల త్యాగాలను భావితరాలకు చాటాలి

### భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 17) :** నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి సాగించిన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాల ఫలితమే హైదరాబాద్ సంస్థాన విమోచన అని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కొనియాడారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం గురువారం అధికారికంగా నిర్వహించిన 79వ హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించి, అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**భావితరాలకు చాటాలి..**

హైదరాబాద్ సంస్థాన విమోచన పోరాటం కేవలం కొందరు నాయకులకు మాత్రమే పరిమితం కాలేదని, ఆదివాసీలు, రైతులు, విద్యార్థులు, సామాన్యులు ప్రాణాలర్పించిన గొప్ప ప్రజా ఉద్యమమని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. చరిత్రలో మరుగునపడిన రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీం వంటి వీరుల త్యాగాలను జాతీయ స్మృతిలో నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. పోరాట ఘట్టాలు, విలీన ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక చిత్ర ప్రదర్శనను పరిశీలించిన ఆయన, నాటి శౌర్యాన్ని, వీరుల గాథలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**పటేల్ బలమైన పునాది..**

అసాధ్యమనుకున్న హైదరాబాద్ విలీనాన్ని దృఢ సంకల్పంతో సుసాధ్యం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, బలమైన ఏకీకృత భారతదేశ నిర్మాణానికి ఆయనే బలమైన పునాది వేశారని రాధాకృష్ణన్ ప్రశంసించారు. రాజకీయ విలీనం కేవలం భూభాగాలను మాత్రమే కలుపుతుందని, కానీ రాజ్యాంగ ప్రజాస్వామ్యం ప్రజలందరినీ ఏకం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు దక్కినప్పుడే జాతీయ ఐక్యత మరింత బలపడుతుందని స్పష్టం చేస్తూ, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక



# అతని కంటే అందమైన హీరోను చూడలేదు

స్టార్ బ్యూటీ తమన్నా భాటియా తర్వలో 'ది వ్యాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా, దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ తాజాగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తమన్న, సిద్ధార్థ్‌పై ప్రశంసలు కురిపంచింది. 'నా 20 ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో సిద్ధార్థ్ అంతటి అందమైన నటుడిని చూడలేదు. అసలు "హ్యాండ్‌సమ్" అనే పదానికి నిలువెత్తు రూపం సిద్ధార్థ్ మల్హోత్రా' అంటూ సిద్ధార్థ్ మల్హోత్రాపై ప్రశంసలు కురిపించింది తమన్న. అలాగే ఈ సినిమాలో ఛఠ్ పూజ నేపథ్యంలో చిత్రీకరించిన పాట గురించి మాట్లడుతూ.. 'నేను ముంబయిలో పుట్టిపెరిగాను. అక్కడ జుహూ బీచ్‌లో కొన్ని వేలదిమంది మహిళలు ఛఠ్ పూజ చేయడం చూసేదాన్ని. అయితే ఆ సంప్రదాయం గురించి నాకు ఎలాంటి వివరాలు తెలియవు. సినిమాలో పాట చిత్రీకరిస్తున్నప్పుడు ఆ పూజ చేయడం ఎంత కష్టమో అర్థమైంది. దాదాపు 36 గంటల పాటు నీళ్లు కూడా ముట్టుకోకుండా భక్తిశ్రద్ధలతో మహిళలు ఆ పూజలో నిమగ్నమవుతారు. బీహారీ సంస్కృతిలో ఈ పూజ అందమైన భాగం. మనం ఉదయించే సూర్యుడికి నమస్కరించి పూజాదికాలు చేస్తాం. కానీ వారు అస్తమించే సూర్యుడికి కూడా అంతే ప్రాముఖ్యతనిస్తారు. ఈ పాట షూటింగ్ టైమ్‌లో ఏదో అతీతశక్తి నాలో ప్రవేశించి ఉద్వేగాన్ని కలిగించినట్లుగా అనిపించేది. నా హృదయాన్ని కదిలించిన పాట ఇది' అంటూ చెప్పుకొచ్చింది.

